

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి 8లో



సాయినాథుని శోభాయాత్ర 8లో



పలు రైళ్లకు అదనపు కోచ్‌లు 8లో

న్యూస్‌రీల్

ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ డీడీగా రమణమూర్తి



దాబాగార్డెన్స్‌: ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ఎన్‌ ఎస్‌వీ రమణమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో కర్నూలు మెడికల్‌ కళాశాలలో స్టాటస్టికల్‌ ఆఫీసర్‌గా పనిచేసిన ఆయనకు పదోన్నతి లభించింది. 2014 నుంచి 2022 వరకు జీవీఎంసీలో స్టాటస్టిక్స్‌ విభాగంలో పనిచేసిన రమణమూర్తి, కోవిడ్‌ సమయంలో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు.

ప్యాకెట్ల రూపంలో అప్పన్న చందనం విక్రయాలు

సింహాచలం: చందనోత్సవంరోజు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనాన్ని పురస్కరించుకుని స్వామిపై ఒలిచిన విసర్జన చందనం 97 కిలోలు వచ్చినట్టు దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్‌ తెలిపారు. త్వరలోనే భక్తులకు చందనాన్ని ప్యాకెట్లు రూపంలో విక్రయాలు జరుపుతామని పేర్కొన్నారు.

కారు ఢీకొని జింకకు గాయాలు



జింకను సంరక్షిస్తున్న యువకుడు

కొమ్మాది: బీచ్‌రోడ్డులో ఇందిరాగాంధీ జూపార్కు సమీపంలో నగరం నుంచి భీమిలి వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు దాటుతున్న జింకను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జింక ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ఓ యువకుడు గమనించి, గాయపడిన జింకను రోడ్డు పక్కకు చేర్చి నీరు తాగించాడు. అనంతరం దానిని సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టాడు. అయితే, ఇటీవల కాలంలో జింకలు తరచూ జనావాసాల్లోకి రావడం, ప్రమాదాలకు గురికావడంపై జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ప్రమాదాల బారిన పడి మరికొన్ని జింకలు మృత్యువాత పడుతున్నా అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి సీపీ సన్మానం



ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందితో సీపీ బాగ్చి

విశాఖ సిటీ: విశాఖ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న ఏడుగురు సిబ్బందిని నగర పోలీస్‌ కమిషనర్‌ డాక్టర్‌ శంఖబ్రత బాగ్చి గురువారం సన్మానించారు. హోంగార్డు కమాండెంట్‌ కె.వి. ప్రేమ్‌జిత్‌, ఎస్‌ఐ ఐ.నాగరాజు, ఏఆర్‌ఎస్‌ఐ కె.అప్పారావు, ఏఎస్‌ఐ కె.వి.ఎస్‌.ఎన్‌.మూర్తి, ఏఎస్‌ఐ వై.ఈశ్వరరావు, హెచ్‌సీ టి.రాము, హోంగార్డు పి.శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ పొందారు. దీంతో వీరిని కుటుంబ సభ్యులతో కలిపి గురువారం పోలీస్‌ సమావేశ మందిరానికి ఆహ్వానించారు. పోలీస్‌ అధికారుల సమక్షంలో వారిని సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపి వీడ్కోలు పలికారు.

కూటమి నేతల కక్కుర్తే
కొంపముంచింది

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పుణ్యక్షేత్రాల్లో ఎన్నడూలేని ఘోరాలు, విషాదాలు సంభవిస్తున్నాయి. భక్తుల సౌకర్యాల కంటే.. ఉత్సవ సమయంలో ఎంత ఎక్కువగా సొమ్ము చేసుకోవచ్చనే దానిపై కూటమి నేతల ఆత్రమే వీటికి కారణమన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హోం మంత్రి దగ్గర నుంచి.. భీమిలి ఎమ్మెల్యే వరకూ ప్రతి ఒక్కరూ తమ అనుచరులకు కాంట్రాక్టులు, అనుయాయులకు వీఐపీ టికెట్లు ఇప్పించుకోవడంలోనే నిమగ్నమయ్యారు. ఎంత మంది భక్తులు వస్తారు, ఎలాంటి ఏర్పాట్లు చేయాలన్న దానిపై దృష్టిసారించలేదు. కూటమి నేతల కాసుల కక్కుర్తి ఈ దుర్ఘటనతో మరోసారి స్పష్టమైంది.



సాక్షి, విశాఖపట్నం: ఊహకందని విషాదం యావత్‌ రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఏడుగురి ప్రాణాల్ని బలిగొన్న దుర్ఘటనలో కూటమి ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు.. భారీ వర్షం కారణంగానే ప్రమాదం జరిగిందంటూ ముఖ్యమంత్రి నుంచి కింది స్థాయి నాయకుల వరకూ వంత పాడుతున్నారు. కానీ.. కూటమి నేతల కక్కుర్తి కారణంగానే విషాదం నెలకొందని తెలుస్తోంది. కేవలం తమకు చందనోత్సవం వల్ల ఏం లాభం ఒనగూరుతుందనే దానిపైనే ఎక్కువ దృష్టి సారించారు తప్ప... సామాన్య భక్తులకు అప్పన్న దర్శనం సజావుగా జరిగేలా చూసేందుకు ఎలాంటి ఏర్పాట్లు చెయ్యాలి.. ఎక్కడా ఇబ్బందులు లేకుండా చందనోత్సవాన్ని ఎలా నిర్వహించాలనేదానికి ప్రాధాన్యమివ్వలేదు. ఏర్పాట్లు చేసేందుకు వివిధ రకాల పనుల్ని కాంట్రాక్టు సంస్థలకు అప్పగించారు. ఈ పనులన్నింటినీ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, హోంమంత్రి అనిత స్వయంగా పర్యవేక్షిస్తూ... తమకు నచ్చిన వారికే కాంట్రాక్టులు అప్పగించారు.

వాటర్‌ బాటిళ్ల మాయాజాలం!

ప్రతి చందనోత్సవానికి జీవీఎంసీ నీటిని పూర్తిస్థాయిలో సరఫరా చేస్తుంది. దీనికి తోడుగా.. సింహాచలం దేవస్థానానికి మంచినీటి బాటిళ్లని అందించే రెగ్యులర్‌ కాంట్రాక్టర్‌ కూడా ఉన్నారు. ప్రతి ఉత్సవానికి వీఐపీలకు 500 మిలీ బాటిల్స్‌ సరఫరా చేస్తుంటారు. ఈ చందనోత్సవానికి కూడా సదరు కాంట్రాక్టర్‌ 500 మిలీ బాటిల్స్‌ని లక్ష సరఫరా చేసే టెండరు అప్పగించారు. జీవీఎంసీ 20 లీటర్ల క్యాన్లు, పేపర్‌ గ్లాసుల్ని భారీ స్థాయిలో భక్తుల కోసం క్యూలైన్లలో, బస్‌ పాయింట్స్‌ దగ్గర, తొలి పావంచా దగ్గర ఏర్పాటు చేసింది. అయినా.. నీటి బాటిళ్లలో హోంమంత్రి మాయాజాలం ప్రదర్శించారు. అవసరం లేకపోయినా.. 250 మిలీ నీటి బాటిల్స్‌ కచ్చితంగా ఉండాలంటూ హుకుం జారీ చేశారు. భక్తులు లక్షన్నర వరకూ వస్తారని అంచనా వేశారు. అయినా.. 3 లక్షల బాటిల్స్‌ అవసరమంటూ హోంమంత్రి చెప్పడంతో దీనికి టెండర్లు పిలిచారు. ఈ టెండర్‌ని హోంమంత్రి ముఖ్య అనుచరుడికి అప్పగించారు. వాస్తవానికి ఈ బాటిల్స్‌ని 3 లక్షల వరకూ సరఫరా చేస్తామని చెప్పి టెండరు దక్కించుకున్న హోం మంత్రి అనుచరుడు.. కేవలం లక్షన్నర బాటిల్స్‌ మాత్రమే ఇచ్చి.. లెక్క మాత్రం 3 లక్షలుగా చూపించినట్లు తెలుస్తోంది.

ఏర్పాట్లన్నీ గంటా అనుచరులకే..

అదే విధంగా.. ఏర్పాట్ల టెండర్ల వ్యవహారమంతా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నడిపించినట్లు సమాచారం. టెంట్లు, లైటింగ్‌, ఇతర పనులకు సంబంధించిన మొత్తం టెండర్లన్నీ గంటా దగ్గరుండి మరీ అనుచరులకు అప్పగించినట్లు తెలుస్తోంది. ఇలా కాంట్రాక్టుల ద్వారా అనుచరులకు లబ్ధి కలిగించేందుకు ప్రయత్నించారే తప్ప.. భక్తుల గురించి కనీసం పట్టించుకోలేదు. పోనీ ఆ పనులైనా సక్రమంగా చేపట్టారా అంటే.. దానికి కూడా అతీగతీ లేకుండా పోయింది. ఘటన జరిగిన తర్వాత.. బస్సులు కొండపైన నిలిపేయడంతో భక్తులు దిగువనే ఉండిపోయారు. అక్కడ కనీస సౌకర్యాలు అందక నరక యాతన అనుభవించారు. ఇలా.. సింహాచలంలో జరిగిన దారుణానికి ప్రధాన కారణం కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమే అయినా.. వరుణుడిపై నెట్టేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.





అమోఘం రిషిక నాట్యం

- ఢిల్లీకి విశాఖ కీర్తి
- అంతరంగ ఉత్సవ్‌–2025లో ప్రథమ స్థానం
- ప్రధాని మెచ్చిన కళాకారిణి

8లో

డిజిటల్‌ క్లాక్‌ డిజైన్‌కు రూ.5లక్షల నజరానా

తాటిచెట్లపాలెం: రైల్వే స్టేషన్లలో సమయాన్ని చూపించే డిజిటల్‌ గడియారం డిజైన్‌ చేసేందుకు ఆసక్తి గల వారి నుంచి డిజైన్లను భారతీయ రైల్వే ఆహ్వానిస్తోంది. ఎంపిక చేసిన డిజైన్‌కు రూ. 5 లక్షల బహుమతి కూడా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు వాల్తేర్‌ డివిజన్‌ అధికారులు ఒక ప్రకటన ద్వారా వివరాలు తెలిపారు. భారతీయ రైల్వే, దేశంలోని అన్ని రైల్వే స్టేషన్లలో ప్రదర్శించడానికి జాతీయ స్థాయిలో డిజిటల్‌ గడియారం డిజైన్‌ పోటీని నిర్వహిస్తోంది. ఈ పోటీని మూడు విభాగాలుగా విభజించారు. నిపుణులు, కళాశాల/ విశ్వవిద్యాలయ విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు. ఈ మూడు విభాగాల నుంచి ఎంపిక చేసిన ఉత్తమ డిజైన్‌కు మొదటి బహుమతిగా రూ. 5 లక్షలు అందజేస్తారు. అలాగే ప్రతి విభాగం నుంచి ఐదుగురికి ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతులు కూడా ఇవ్వనున్నారు. ఆసక్తి గల వారు తమ డిజైన్‌లను మే 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని రైల్వే అధికారులు తెలిపారు. ఎంట్రీలు అధిక రిజల్యూషన్‌లో ఉండాలి, వాటిపై వాటర్‌మార్క్‌లు, లోగోలు వంటివి ఏమీ ఉండకూడదు. అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాన్ని కూడా జతచేయాలని రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ (ఇన్ఫర్మేషన్‌ అండ్‌ పబ్లిసిటీ) దిలీప్‌కుమార్‌ తెలిపారు. పాల్గొనేవారు ఎన్ని డిజైన్‌లనైనా పంపవచ్చు, అయితే ప్రతి డిజైన్‌కు సంబంధించిన వివరణ, దాని ఉద్దేశ్యం స్పష్టంగా ఉండాలని సూచించారు. పాఠశాల విభాగంలో ప్లస్‌ 2 వరకు చదివే విద్యార్థులు అర్హులు, వారు తమ పాఠశాల గుర్తింపు కార్డును కూడా అప్‌లోడ్‌ చేయాలి. కళాశాల , విశ్వవిద్యాలయ విద్యార్థులు కూడా వారి ప్రస్తుత విద్యార్థి స్థితిని తెలిపే పత్రాలను అప్‌లోడ్‌ చేయాలని తెలిపారు.

మెట్ల నిర్మాణ ప్రణాళిక మార్పే
ప్రాణాలను బలిగొందా...



మెట్లమార్గం ఎడమవైపు డైవర్షన్‌ ప్రాంగణంలో చోటుచేసుకున్న ప్రమాదం

- పాత పద్ధతిలోనే మెట్లమార్గం నిర్మిస్తే ప్రమాదం జరిగేది కాదు
- అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం

సింహాచలం: సింహాచలం కొండపై షాపింగ్‌ కాంప్లెక్స్‌ వద్ద నుంచి జోడు భద్రాల ప్రాంగణానికి వెళ్లేందుకు నిర్మించిన కొత్త మెట్లమార్గం రూపకల్పనలో చేసిన మార్పులే ఏడుగురు భక్తుల ప్రాణాలను బలిగొన్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో అనేక చందనోత్సవాల సమయంలో అదే స్థలంలో ఉన్న పాత మెట్లమార్గంలో తీవ్రమైన తోపులాటలు, అధిక రద్దీ నెలకొన్నప్పటికీ ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే, దురదృష్టవశాత్తు చరిత్రలో మొదటిసారిగా అదే ప్రదేశంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. వివరాల్లోకి వెళితే, సింహగిరిపై ఉన్న బస్టాండ్‌ నుంచి ఆలయానికి చేరుకోవడానికి ఉన్న మెట్లమార్గం ఇరువైపులా రెండు బ్లాక్‌లలో వ్యాపారుల షాపింగ్‌ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. గతంలో ఈ మెట్లమార్గం నేరుగా జోడు భద్రాల ప్రాంగణానికి చేరుకునేది. చందనోత్సవం రోజుల్లో భక్తులను ఈ మార్గంలోనే వరుస క్రమంలో పంపి నేరుగా జోడు భద్రాల ప్రాంగణానికి వెళ్లేలా ఏర్పాట్లు చేసేవారు. ప్రసాద్‌ స్కీమ్‌ కింద పాత షాపింగ్‌ కాంప్లెక్స్‌ను తొలగించి, కొత్త దుకాణాలను రెండు బ్లాక్‌లుగా పాత పద్ధతిలోనే నిర్మించారు.అయితే, ఈ రెండు బ్లాక్‌ల మధ్య నిర్మించిన కొత్త మెట్లమార్గం విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం వహించారు. పాత ప్రణాళికలను అనుసరించకుండా, జోడు భద్రాల వద్దకు చేరుకునే మెట్లను కుడి, ఎడమ వైపులకు మళ్లించారు. మధ్యలో దాదాపు తొమ్మిది అడుగుల ఎత్తులో నాసిరకమైన గోడను నిర్మించడంతో, ఎడమ వైపు నుంచి రూ.300 క్యూలో వెళ్తున్న భక్తులపై అది ఒక్కసారిగా కూలిపోయింది. ఈ దుర్ఘటనలో అక్కడికక్కడే ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు.

వైదిక వర్గాలు చెబుతున్నా లెక్కచేయకుండా...


ఏటా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి కొండ దిగువన నాలుగు పర్యాయాలు ఉత్సవాలు జరుగుతాయి. ఆ సందర్భాలలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను కొండపై నుంచి పల్లకిలో దిగువకు తీసుకువస్తారు. గతంలో జోడు భద్రాల నుంచి నేరుగా ఉన్న మెట్లమార్గం ద్వారానే ఊరేగింపు జరిగేది. కొత్త షాపింగ్‌ కాంప్లెక్స్‌ నిర్మాణం తర్వాత కూడా అదే విధంగా నిర్మించాలని పలువురు వైదిక పండితులు సూచించినప్పటికీ, అధికారులు వారి మాటలను పట్టించుకోలేదని తెలుస్తోంది. వారి నిర్లక్ష్య వైఖరి ఇప్పుడు ఏడుగురు భక్తుల ప్రాణాలను బలిగొన్న విషాదానికి దారితీసింది.

నేడు కూడా విచారణ

సింహాచలంలో గోడ కూలి ఏడుగురు మృతి చెందిన ఘటనపై ప్రభుత్వం నియమించిన త్రీ మెన్‌ కమిటీ శుక్రవారం కూడా విచారణ చేయనుంది. దేవస్థానం అధికారులను కూడా విచారించనుంది. గురువారం సంబంధిత ప్రాంతాన్ని బృందం సభ్యులు పరిశీలించి వివరాలు సేకరించారు.

విషాదంతో ఉలిక్కిపడ్డ వ్యాపారులు

కొత్తగా నిర్మించిన షాపింగ్‌ కాంప్లెక్స్‌లోకి ప్రవేశించి నాలుగు రోజులు కూడా గడవకముందే, తమ ప్రాంగణంలో ఇంతటి ఘోర విషాదం చోటుచేసుకోవడంతో సింహగిరి వ్యాపారులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పాదాలమ్మ–బంగారమ్మ ఆలయాల ప్రాంగణంలో తాత్కాలిక దుకాణాల్లో వ్యాపారం చేసుకుంటున్న వర్తకులను, చందనోత్సవానికి కేవలం నాలుగు రోజుల ముందు హడావుడిగా, ఇంకా పూర్తిగా సిద్ధం కాని కొత్త షాపింగ్‌ కాంప్లెక్స్‌లోకి తరలించారు. చందనోత్సవ సమయంలో వాహనాల పార్కింగ్‌ కోసం స్థలం అవసరమని చెప్పడంతో వ్యాపారులు అయిష్టంగానే కొత్త షాపింగ్‌ కాంప్లెక్స్‌లోకి మారారు. తరలి వెళ్లిన కొద్ది రోజులకే తమ షాపింగ్‌ కాంప్లెక్స్‌ వద్దే ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారని తెలిసి ఆందోళన చెందారు. సింహగిరి చరిత్రలో ఎన్నడూ ఇలాంటి దుర్ఘటన జరగలేదని, అయ్యో పాపం భక్తులంటూ వారు కన్నీటి పర్యంతమయ్యారు.



గోడ కూలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న త్రీమెన్‌ కమిటీ సభ్యులు

కార్మిక హక్కుల సాధనకు ఉద్యమం

- మే 20 అఖిల భారత సమ్మెను విజయవంతం చేయండి
- మేడే సభలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్‌ నరసింగరావు పిలుపు

సీతమ్మధార: మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణ కోసం ఉద్యమించాలని, మే 20న జరిగే అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్‌ నరసింగరావు పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా గురువారం దొండపర్తి రైల్వే డీఆర్‌ఎం కార్యాలయం నుంచి ఆశీలమెట్ట వరకు సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ భారీ ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ, కార్మికులు పోరాడి సాధించిన హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను 4 లేబర్‌ కోడ్‌లుగా మార్చి యజమానులకు ఊడిగం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కాంట్రాక్ట్‌ కార్మికుల తొలగింపు వంటి చర్యలను ఆయన తప్పుబట్టారు.



డీఆర్‌ఎం కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నరసింగరావు, కార్మిక నేతలు

స్కీమ్‌ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మోదీ విధానాలనే అమలు చేస్తోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌.కె.ఎస్‌.వి. కుమార్‌ విమర్శించారు. ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం , వీవోఏర్పీలకు పనిభారం పెంచి వేతనాలు పెంచకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆరోపించారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్‌ చేశారు. గత 15 ఏళ్లుగా కనీస వేతనాల జీవోలు సవరించకపోవడంతో కార్మికులు నష్టపోతున్నారని, కనీస వేతనం నెలకు రూ. 26 వేలు ఉండేలా జీవోలు ఇవ్వాలని కోరారు. ఆప్కాస్‌ రద్దు చేసి పాత కాంట్రాక్ట్‌ విధానం తీసుకురావడం దుర్మార్గమని, ఆప్కాస్‌ రద్దు చేస్తే కార్మికులను పర్మినెంట్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.మణి, జిల్లా ఆఫీస్‌ బేరర్స్‌ పి.వెంకటరెడ్డి, ఎం.సుబ్బారావు, పి.వెంకటరావు, పి.కృష్ణారావు, జి.అప్పలరాజు, కె.కుమారి, టి.నూకరాజు, టి.నాయుడు, ఆర్‌.నాయుడు, వై.రాజు, అప్పలనాయుడు, కె.శేఖర్‌, ఎ.సీతాలక్ష్మి, ఎంసీహెచ్‌. అప్పడు, కె.జె.అప్పారావు,శ్రీనివాస్‌, ఝాన్సీ , మల్లీశ్వరి సీతారత్నం, నరేంద్రకుమార్‌, పెద్ద సంఖ్యలో వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న చిన్నారులు

శాస్త్రోక్తంగా ముగిసిన సహస్ర ఘటాభిషేకం

తెల్లవారుజామున 3 గంటలకు అప్పన్నకు తొలివిడత చందనం సమర్పణ



ప్రధాన కలశాన్ని శిరస్సుపై పెట్టుకుని అభిషేకం నిర్వహణకు వస్తున్న ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు

సింహాచలం: చందనోత్సవం సందర్భంగా నిర్వహించిన సహస్ర ఘటాభిషేకం గురువారం తెల్లవారుజామున 1 గంటకు ముగిసింది. అనంతరం, తెల్లవారుజామున 3 గంటలకు స్వామివారికి మొదటి విడతగా మూడు మణుగుల చందనాన్ని శాస్త్రోక్తంగా సమర్పించారు. గురువారం స్వామివారు గుమ్మడిపండు ఆకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఫిరాయింపు కార్పొరేటర్లకు నిరసన సెగ చూపండి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్


కార్పొరేటర్లను సత్కరిస్తున్న మళ్ల విజయప్రసాద్

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయ ప్రసాద్

గోపాలపట్నం: జీవీఎంసీ మేయర్ అవిశ్వాస తీర్మానంలో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన కార్పొరేటర్లు, నాయకులకు కార్యకర్తల నిరసన సెగ ఎలా ఉంటుందో చవిచూపించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కృష్ణా కళాశాల దరి పార్టీ కార్యాలయంలో గురువారం పశ్చిమ నియోజకవర్గం కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ గుర్తుతో గెలిచిన కార్పొరేటర్లు అమ్ముడుపోవడం దారుణమన్నారు. ఇలాంటి వారిని ప్రజల్లో తిరగనీయవద్దని సూచించారు. వీరి గురించి ప్రజలకు తెలిసేలా నల్లజెండాలతో శాంతియుత కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

పశ్చిమ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వార్డుల వారీగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటానని భరోసానిచ్చారు.

ఎవరెన్ని ప్రలోభాలు పెట్టినా లొంగకుండా, పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్న నియోజకవర్గ పరిధి కార్పొరేటర్లు పీవీ సురేష్, గుండపు నాగేశ్వరరావు, గులిగిందల లావణ్య, బల్ల లక్ష్మణరావులను ఘనంగా సత్కరించారు. తొలుత మేడే సందర్భంగా వైఎస్సార్‌టీయూసీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి బీఎస్ కృష్ణ, దొడ్డి కిరణ్, బాకి శ్యామ్ కుమార్‌రెడ్డి, ఆళ్ల పైడిరాజు, పలు వార్డుల అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి

సీతమ్మధార: వైద్య ఆరోగ్య శాఖలో, జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం నాల్గవ రోజు కూడా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. కొందరు మహిళా ఉద్యోగులు తమ చిన్న పిల్లలను ఒడిలో పట్టుకుని నిరసన తెలిపారు.ధర్నా శిబిరాన్ని సందర్శించిన సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ, ఆరోగ్య శాఖలో కీలకమైన విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. వారి పోరాటానికి సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.ఎస్.ఎన్ ప్రజ్ఞ, కార్యదర్శి గంట సుధ మాట్లాడుతూ, ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్లు పూర్తి చేసుకున్న సీహెచ్‌ఓలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఈపీఎఫ్‌ను పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించి క్రమం తప్పకుండా ఇవ్వాలని కోరారు. నిర్దిష్టమైన జాబ్ చార్ట్ ఇవ్వాలని, ఎఫ్‌ఆర్‌ఎస్ నుండి సీహెచ్‌వోలకు మినహాయింపు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. హెచ్‌ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, బదిలీలు, ఎక్స్ గ్రేషియా, పితృత్వ సెలవులు వంటివి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జి.సుధారాణి, పి.దివ్య, బి.శ్రావణి, టి.మోషే, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

విరామమెరుగని జీవనం



అగాధాల నుంచి దిగంతాల దాకా.. నీ చెమట చుక్కలే ప్రపంచ నాగరికత.. నీ రక్త ధారలే విశ్వ మానవుడి కథ. బతుకు వెతలను ఓర్చుకుంటూ.. రెక్కలు ముక్కలు చేసుకుంటూ.. రక్త మాంసాలే స్వేద బిందువులుగా.. వసుధైక కుటుంబానికి ఆధారమైన శ్రామికుడి గురించి ఎంత చెప్పినా తక్కువే. తనకంటూ చెప్పుకునే మేడే రోజున కూడా కుటుంబ పోషణకు శ్రమిస్తున్న భవన నిర్మాణ కార్మికుల కష్టం.. ఇలా సాక్షి కెమెరా కంటికి చిక్కింది.

- ఫొటోలు: సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం

అమోఘం రిషిక నాట్యం


సాధించిన పతకాలతో రిషిక

- ఢిల్లీకి విశాఖ కీర్తి
- ప్రధాని మెచ్చిన కళాకారిణి
- అంతరంగ ఉత్సవ్-2025లో ప్రథమ స్థానం


తల్లి, చెల్లితో రిషిక

తాటిచెట్లపాలెం:

నగరానికి చెందిన జి. రిషిక తన అకుంఠిత దీక్షతో, అద్భుతమైన ప్రతిభతో దేశవ్యాప్తంగా విశాఖ కీర్తిని చాటిచెబుతోంది. ఇటీవల ముంబయిలోని మినిస్ట్రీ ఆఫ్ కల్చరల్ లతా మంగేష్కర్ నాట్యగృహ ఆడిటోరియంలో జరిగిన అంతరంగ ఉత్సవ్-2025లో కూచిపూడి నృత్య ప్రదర్శనతో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇది మాత్రమే కాదు, 2023-24 సంవత్సరంలో న్యూఢిల్లీలో మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, ఎన్సీఈఆర్టీ సంయుక్తంగా నిర్వహించిన కళా ఉత్సవ్‌లోనూ రిషిక తన కూచిపూడి నాట్యంతో క్లాసికల్ డ్యాన్స్ బాలికల విభాగంలో స్వర్ణ పతకం సాధించి సంచలనం సృష్టించింది. తద్వారా కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌కు సైతం దేశ రాజధానిలో విశేషమైన గుర్తింపు లభించింది. రిషికలోని అసాధారణ ప్రతిభను స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుర్తించడం విశేషం. గత ఏడాది జరిగిన గణతంత్ర దినోత్సవం, అలాగే విద్యార్థులతో ప్రధాని ముఖాముఖి నిర్వహించే 'పరీక్షా పె చర్చా' కార్యక్రమానికి ఆమెను ప్రత్యేక అతిథిగా ఆహ్వానించారు. ఇటీవల ముంబయిలో విజయం సాధించి నగరానికి తిరిగి వచ్చిన రిషికను కేవీ స్కూల్ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

సాధారణ కుటుంబం.. అసాధారణ ప్రతిభ

రిషిక తండ్రి ఒక ప్రైవేటు కళాశాలలో గుమస్తాగా పనిచేస్తుండగా, తల్లి బి.రామలక్ష్మి మల్లునాయుడు పాలెంలోని జెడ్పీ హైస్కూల్లో ఆర్ట్/క్రాఫ్ట్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రిషిక చెల్లి ప్రస్తుతం కేవీ వాల్తేర్‌లో 9వ తరగతి చదువుతోంది. వీరి కుటుంబంలో సంగీతం, నాట్యం వంటి కళలకు సంబంధించి ఎలాంటి నేపథ్యం లేకపోయినా, చిన్ననాటి నుంచే రిషికకు నృత్యంపై ఉన్న అమితమైన ఆసక్తిని తల్లి గుర్తించారు. సినిమా పాటలకు అనుగుణంగా రిషిక చేసే నాట్యాన్ని చూసి మురిసిపోయేది. తల్లి ప్రోత్సాహంతో రిషిక క్లాసికల్ డ్యాన్స్‌లో చేరింది.

మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రత్యేక ఆహ్వానం

రిషిక ప్రతిభకు ముగ్ధులైన న్యూ ఢిల్లీలోని మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఈ నెల 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు న్యూఢిల్లీలో నిర్వహించనున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి ఆమెను ఆహ్వానించింది. ఎన్సీఈఆర్టీ కళాఉత్సవ్ 2023-24 విజేతలకు ఈ ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. వారు రాణిస్తున్న కళా రూపాల్లో మరిన్ని మెళకువలు నేర్పించి, వారి ప్రతిభను మరింతగా మెరుగుపరచడమే ఈ ప్రతిభా సంవర్ధన్ - 2025 కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొనేందుకు రిషిక మరోసారి ఢిల్లీకి వెళ్లనుంది. రిషిక సాధించిన విజయాలు కేవలం ఆమె కుటుంబానికే కాకుండా, విశాఖ నగరానికి, కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌కు గర్వకారణం. చిన్న వయస్సులోనే ఆమె కనబరుస్తున్న అకుంఠిత దీక్ష, అద్భుతమైన నృత్య ప్రతిభ ఎందరికో స్ఫూర్తిదాయకం.


ముంబయిలో జరిగిన పోటీల్లో విజేతగా నిలిచి అవార్డు అందుకుంటున్న రిషిక

5వ తరగతి నుంచే అవార్డులు

తల్లి ప్రోత్సాహంతో రిషిక ఎన్నో నృత్య పోటీలలో పాల్గొని తన ప్రతిభను నిరూపించుకుంది. 5వ తరగతిలో ప్రతిష్టాత్మకమైన 'రూట్స్ టు రూట్స్ ఎక్స్‌ంప్లరి' అవార్డును అందుకుంది. 6వ తరగతిలో రీజినల్ స్థాయికి చేరుకుని తన ప్రస్థానాన్ని కొనసాగించింది. అదే స్ఫూర్తితో గత సంవత్సరం రీజినల్, రాష్ట్ర స్థాయి పోటీల్లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 37 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 2 వేల మంది పోటీదారులను అధిగమించి జాతీయ స్థాయిలో ప్రథమ స్థానాన్ని సొంతం చేసుకుంది.


ఢిల్లీలో కేంద్రమంత్రి చేతులమీదుగా బహుమతిని అందుకుంటున్న రిషిక (ఫైల్)

భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, విశాఖ కీర్తిని వినువీధిన ఎగురవేయాలని ఆశిద్దాం.

మాటల్లో చెప్పలేని అనుభూతి

దేశవ్యాప్తంగా జరిగిన ప్రతిష్టాత్మక పోటీలో ప్రథమ స్థానం సాధించడం మాటల్లో చెప్పలేని ఆనందాన్నిచ్చింది. చదువుతో పాటు నాట్యం అంటే నాకు ప్రాణం. ప్రస్తుతం నేను 12వ తరగతి చదువుతున్నాను. ఇంత చిన్న వయస్సులోనే మన దేశ ప్రధానితో 'పరీక్షా పె చర్చా' కార్యక్రమంలో పాల్గొనడం, గణతంత్ర వేడుకల్లో ప్రత్యేక అతిథిగా ఉండటం నా జీవితంలో మర్చిపోలేని అనుభూతులు. గతంలోనూ ఎన్నో నృత్య ప్రదర్శనల్లో పాల్గొని మొమెంటోలు, షీల్డ్‌లు అందుకున్నాను. ఈ విజయాలన్నిటి వెనుక నా తల్లి నిరంతర ప్రోత్సాహం, నాట్య గురువు ఆర్.కృష్ణవేణి అలుపెరగని శిక్షణ, సంగీతం మాస్టారు త్యాగరాజు అందించిన మార్గదర్శనం ఎప్పటికీ మరువలేనివి. మా ప్రిన్సిపాల్, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది కూడా నన్ను అన్ని విధాలుగా ప్రోత్సహించారు. వారందరికీ నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నా.

– జి. రిషిక, కేవీ వాల్తేర్, కూచిపూడి నృత్య విజేత

పిల్లల విజయాలే మాకు ఆనందాలు

పిల్లల అభిరుచులను గుర్తించి వారిని ప్రోత్సహించడంలో తల్లిదండ్రులకు కలిగే ఆనందం వర్ణనాతీతం నా పెద్దమ్మాయి రిషిక రెండో తరగతిలో ఉన్నప్పటి నుంచే నాట్యంపై ప్రత్యేకమైన ఆసక్తి కనబరిచేది. ఆ చిన్నారి మనసులోని కళాతృష్ణను నేను గమనించాను. ఏమాత్రం ఆలస్యం చేయకుండా తనను నాట్య శిక్షణలో చేర్పించాను. ఆ శిక్షణ ఫలితంగా, తన అద్భుతమైన ప్రతిభతో ఎన్నో వేదికలపై ప్రదర్శనలిచ్చి, అనేక బహుమతులు అందుకుంది. ఎందరో కళాభిమానుల ప్రశంసలు సొంతం చేసుకుంది. నా చిన్నమ్మాయి జి.త్రిపుర శ్రీ కూడా తనదైన రంగంలో రాణిస్తోంది. తను కర్ణాటక సంగీతం అభ్యసిస్తోంది. డాక్టర్ డీవీకేజీ త్యాగరాజు మాస్టారే తన సంగీత గురువు. సంగీతంతో పాటు, తను అద్భుతంగా పెయింటింగ్స్ వేస్తుంది. చురుకైన అమ్మాయి కావడంతో వాలీబాల్ కూడా ఆడుతుంది. పిల్లల ఆసక్తులను గుర్తించి, వారికి సరైన ప్రోత్సాహం అందించినప్పుడే కదా తల్లిదండ్రుల జన్మ ధన్యమవుతుంది. వారి విజయాలే మాకు నిజమైన ఆనందాన్నిస్తాయి.

– బి. రామలక్ష్మి, రిషిక తల్లి

బాల్యం విద్యా కేంద్రాల పటిష్టతకు చర్యలు

దాబాగార్డెన్స్: ప్రాథమిక విద్యకు జీవీఎంసీ బాల్యం పాఠశాలలు పునాది కావాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్లో బాల్యం విద్యా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి జీవీఎంసీ బాల్యం విద్యా కేంద్రాల పటిష్టత, నమోదు శాతాన్ని పెంచేలా, ఈ వేసవి సెలవుల్లో ప్రణాళికలు చేపట్టాలన్నారు. 3 నుంచి 5 ఏళ్ల పిల్లలకు ఉత్తమ పూర్వ ప్రాథమిక విద్యనందించేలా బాల్యం కేంద్రాలు పని చేయాలన్నారు. అనంతరం బాల్యం విద్యా కేంద్రాల్లో నమోదు శాతం పెంచేందుకు, అక్కడ అందించే విద్య, ఇతర సౌకర్యాల వివరాలతో కూడిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ వర్మ, బాల్యం విద్యా పథకం ప్రాజెక్టు కో ఆర్డినేటర్ మోహన్‌కుమార్ ఆవులపాటి తదితరులు పాల్గొన్నారు.


బాల్యం కేంద్రాల వసతులపై పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్, అదనపు కమిషనర్

కిశోర బాలికల వికాసానికి ప్రత్యేక శిక్షణ

ఎంవీపీ కాలనీ: కిశోర బాలికల వికాసంపై ప్రత్యేక శ్రద్ధ వహించేందుకు ఆర్పీలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లకు స్థానిక జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ ప్రాంగణంలో గురువారం ప్రత్యేక శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో ఎంవీఆర్ కుమారి పాల్గొని, మాట్లాడారు. కిశోర బాలికల్లో పోషక విలువలు, వికాసానికి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ప్రతి మంగళ, శుక్రవారాల్లో కిశోర బాలికలను గుర్తించి, వారితో ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక కమిటీలుగా ఏర్పాటు చేసి, సమావేశాలు పెట్టాలన్నారు. వీటి ద్వారా బాలికలకు ఆరోగ్యం, విద్యతో పాటు లైఫ్ స్కిల్స్‌పై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆయా ఆర్పీలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.వినీష తదితరులు పాల్గొన్నారు.


ఆర్పీలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో

రైల్వేస్టేషన్‌లో 11 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రైల్వే పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో విశాఖ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ సిబ్బంది గురువారం వివిధ ప్లాట్‌ఫారాలపై తనిఖీలు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లాకు చెందిన ఆసిఫ్.. గంజాయిని తరలిస్తుండగా ఆర్పీఎఫ్ ఏఎస్ఐ చిట్టిబాబు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.55 వేల విలువగల 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రేమ పెళ్లి కాదన్నారని బలవన్మరణం


కొణతాల లోక నరేంద్ర

సీతమ్మధార: ప్రేమ వివాహానికి అంగీకరించలేదని మనస్తాపం చెందిన ఓ చెందిన యువకుడు గురువారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. అక్కయ్యపాలెంలోని జగన్నాథపురానికి చెందిన కొణతాల లోకనరేంద్ర(29) సొంతంగా క్యాబ్ నడుపుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమించాడు. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుందామనుకున్నాడు. యువతి తల్లిదండ్రులకు విషయం తెలియడంతో ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఇరు కుటుంబాల సమక్షంలో ఇరువురికి సంబంధం లేనట్టు ఉంటామని ఒప్పుకున్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 9న యువతికి పెళ్లి చేసేందుకు ముహూర్తం నిశ్చయించారు. విషయం తెలుసుకున్న యువకుడు ఆ అమ్మాయినే చేసుకుంటానని తల్లిదండ్రుల్ని బతిమాలాడు. వారు నిరాకరించడంతో గురువారం మధ్యాహ్నం ఇంట్లో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఎంతకీ తలుపులు తీయకపోవడంతో పోలీసులకు తెలిపి, యువతితో మాట్లాడించి బయటకు రప్పించేందుకు ప్రయత్నించారు. అయినా స్పందన లేకపోవడంతో పోలీసులు తలుపులు బద్దలుకొట్టి చూడగా ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని, మరణించి ఉన్నాడు. తండ్రి చంద్రరావు ఫిర్యాదు మేరకు సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: వేసవి రద్దీ దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రస్తుతం నడుస్తున్న పలు ప్రత్యేక రైళ్లకు అదనపు కోచ్‌లు జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

- విశాఖలో ఈ నెల 4, 11, 18, 25 తేదీల్లో బయల్దేరే విశాఖపట్నం-ఎస్ఎంవీ బెంగళూరు(08581) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు, తిరుగు ప్రయాణంలో బెంగళూరులో ఈ నెల 5, 12, 19, 26 తేదీల్లో బయల్దేరే ఎస్ఎంవీ బెంగళూరు-విశాఖపట్నం(08582) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు 1-థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జతచేస్తున్నారు.
- విశాఖలో ఈ నెల 6, 13, 20, 27 తేదీల్లో బయల్దేరే విశాఖపట్నం-కర్నూలు సిటీ(08545) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు, తిరుగు ప్రయాణంలో కర్నూలు సిటీలో ఈ నెల 7, 14, 21, 28 తేదీల్లో బయల్దేరే కర్నూలు సిటీ-విశాఖపట్నం(08546) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు 1-థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను కలుపుతున్నారు.
- విశాఖలో ఈ నెల 2, 9, 16, 23, 30 తేదీల్లో బయల్దేరే విశాఖపట్నం-చర్లపల్లి(08579) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు, తిరుగు ప్రయాణంలో చర్లపల్లిలో ఈ నెల 3, 10, 17, 24, 31 తేదీల్లో బయల్దేరే చర్లపల్లి-విశాఖపట్నం(08580) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు 1-థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జతచేస్తున్నారు.

సింహాచలం ఘటనపై 'పచ్చ'పాతం

- ఏడుగురు భక్తుల మరణాల్లో వాస్తవాలను 'సమాధి'చేసిన పచ్చ పత్రికలు
- ప్రభుత్వ వైఫల్యాలను అధికారులపై నెట్టేస్తూ తప్పుడు కథనాలు
- చందనోత్సవంలో మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే అంటున్న అన్ని వర్గాలు
- గతంలో ట్రాఫిక్ రద్దీపైనే నాలుగు పేజీల్లో వక్రభాష్యాలు
- నేడు కూటమి ప్రభుత్వ తప్పిదాలను ప్రస్తావించని అవే పత్రికలు



వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన చందనోత్సవం సమయంలో ఈనాడు ప్రచురించిన కథనాలు

విశాఖ సిటీ: పచ్చ పత్రికలు మరోసారి కళ్లున్న కబోదిలా వ్యవహరించాయి. సింహాచలం కొండపై గోడ కూలి ఏడుగురు భక్తులు నిర్జీవులుగా మారితే.. వాస్తవాలను సమాధి చేశాయి. ప్రభుత్వ వైఫల్యాలను అధికారులపై నెట్టేస్తూ తప్పుడు కథనాలు వండి వార్చాయి. చందనోత్సవం ఘటనలో కూటమి ప్రభుత్వం తప్పేమీ లేదనట్లు సాదాసీదా కథనాలతో సరిపెట్టేశాయి. ప్రముఖ దేవాలయాలన్నింట్లోనూ వరుస ప్రమాదాలు సంభవిస్తూ.. భక్తులు ప్రాణాలు కోల్పోతుంటే.. దాన్ని కూడా గత ప్రభుత్వాలు, లేదా అధికారులపైన నిస్సిగ్గుగా నెట్టేస్తూ రోత రాతలు రాస్తున్నాయి. ఇందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన చందనోత్సవ సమయంలోను, తాజా ఘటనలో రాసిన కథనాలే నిదర్శనం

నేడు అధికారులపై నెపం..

వైఎస్సార్‌సీపీ హయాంలో ఒకరు డీ హైడ్రేషన్‌కు గురైతేనే ప్రభుత్వ వైఫల్యమని తేల్చేసిన పచ్చ పత్రికలు.. నేడు ఏడుగురు సమాధి అయినప్పటికీ.. కూటమి ప్రభుత్వం తప్పులేదన్నట్లు బాకాలు ఊదుతున్నాయి. చందనోత్సవం ఏర్పాట్లపై నెల రోజులుగా ఐదుగురు మంత్రుల కమిటీ సింహాచలంలోనే తిష్ట వేసింది. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామంటూ మంత్రులు ఊదరగొట్టారు. అయితే వీరు చందనోత్సవ ఏర్పాట్లను పక్కనపెట్టి పలు కాంట్రాక్టులను పంచుకున్నారన్న టాక్ వినిపిస్తోంది. క్యూలైన్‌లో భక్తులకు మజ్జిగే కాదు.. మంచి నీటిని కూడా అందించలేదు. కానీ మంచి నీటి బాటిళ్ల విక్రయ కాంట్రాక్టును ఒక మంత్రి అనుచరుడికి అప్పగించడం చర్చనీయాంశమవుతోంది. ఇవన్నీ బహిరంగ రహస్యాలే అయినప్పటికీ పచ్చ పత్రికలకు కనిపించలేదు. కానీ అవసరం లేకపోయినప్పటికీ.. తాత్కాలికంగా గోడను నిర్మించి భక్తుల ప్రాణాలను హరిస్తే.. ఆ నెపాన్ని అధికారులపై నెట్టేస్తూ వార్తా కథనాలను ప్రచురించాయి. భక్తుల నెత్తుటి మరకలు కూటమి ప్రభుత్వానికి అంటుకోకుండా తెగ తాపత్రయ పడుతున్నాయి. ఒకవైపు మృతుల కుటుంబ సభ్యులు సైతం ఈ మరణాలకు ప్రభుత్వానిదే బాధ్యత అని విలపిస్తున్నా.. పచ్చ పత్రికలకు అవేవీ పట్టలేదు. వారి రోదనలు కనిపించలేదు. రాజకీయ పక్షాల నుంచి ప్రజా సంఘాల వరకు సింహాచలం ఘటనలో జరిగిన మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే అని కూటమి ప్రభుత్వ తీరును తూర్పారబడుతుంటే వాటికి వినిపించలేదు. దేవదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌దే తప్పు అంటూ వక్రభాష్యాలకు తెర తీశాయి. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందన అద్భుతమంటూ, బాధితులకు పరిహారం, ఉద్యోగం పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తూ మరోసారి తమ 'పచ్చ' పాత ధోరణిని బయటపెట్టుకున్నాయి.

నాడు వైఎస్సార్‌సీపీపై విషం..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో 2023, ఏప్రిల్ 23న చందనోత్సవ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించింది. సింహాచలం వరాహ నృసింహస్వామి నిజరూప దర్శనం కోసం రెండు లక్షలకు పైగా భక్తులు వచ్చారు. దీంతో సింహాచలం కొండపై ట్రాఫిక్ పెరిగింది. స్వామి దర్శనానికి 3 నుంచి 5 గంటల సమయం పట్టింది. భారీగా భక్తులు రావడంతో ఏర్పడిన ట్రాఫిక్ రద్దీపైనే పచ్చ పత్రికలు విషం కక్కాయి. పతాక శీర్షికతో పాటు నాలుగు పేజీల్లో 'భక్తుల విల విల'అంటూ తప్పుడు కథనాలు వండి వార్చాయి. ఒకవైపు దేవదాయ శాఖ అధికారులు భక్తులకు మంచినీరు, మజ్జిగ సరఫరా చేసినప్పటికీ.. అవేమీ చేయలేదంటూ అబద్ధపు రాతలు రాశాయి. ఆ సమయంలో విపరీతంగా ఉష్ణోగ్రతలు ఉండడంతో ఎండ వేడిని తట్టుకోలేక ఒక మహిళ స్వల్ప అస్వస్థత కలిగితే.. తాటికాయంత అక్షరాలతో అచ్చేశాయి.

ఎంసీవో గోల్డెన్ జూబ్లీ వేడుకలు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో భారతీయ ఆర్మీ, వారి కుటుంబ సభ్యులకు సేవలందించేందుకు ఏర్పడిన మూవ్‌మెంట్ కంట్రోల్ ఆఫీస్(ఎంసీవో)కు గురువారంతో 60 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఇండియన్ ఆర్మీ సిబ్బంది నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం లలిత్ బోరా, కమోడర్ ఎల్ఎం ఫెర్నాండెజ్ హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా భారతీయ భద్రతా దళాలకు తగు సూచనలిచ్చేందుకు 1965 మే 1న ఎంసీవో ఏర్పడిందన్నారు. రైల్వేలతో అనుసంధానమై డిఫెన్స్ కోటా రిజర్వేషన్ల విషయంలో అందిస్తున్న సేవల్ని వివరించారు. డైరెక్టర్ జనరల్ వర్మ, కమాండర్ అశోక్ గొట్టపు, లాజిస్టిక్ ఆఫీసర్ రణ్ విజయ్, ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఇ.శాంతారాం(ఇన్‌ఫ్రా), రైల్వే, ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.

సాయినాథుని శోభాయాత్ర

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం రామకృష్ణానగర్ షిర్డీ సాయి ధ్యాన మందిరం 16వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం శోభాయాత్రను కనుల పండువగా నిర్వహించారు. మేళతాళాలు, కోలాటం నృత్యాల మధ్య సాయి నాథుని ఊరేగింపు వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేటి కిరణ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.